## నూతన డ్రైనేజీ పైప్‌లైన్లను మంజూరు చేయాలి



జలమండలి ఎండీ అశోక్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి

రామచంద్రాపురం, మే 12 : భారతీనగర్ డివిజన్‌లోని డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి నూతన డ్రైనేజీ పైప్‌లైన్ల ఏర్పాటుకు మంజూరు ఇవ్వాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డిని కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి కోరారు. సోమవారం జలమండలి కార్యాలయంలో ఎండీ అశోక్ రెడ్డిని బీఆర్ఎస్ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదర్శ్‌రెడ్డి, కార్పొరేటర్ ప్రత్యేకంగా కలిసి డివిజన్‌లో ఉన్న డ్రైనేజీ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. డివిజన్‌లోని మ్యాక్ సొసైటీ, ఎల్ఐజీ, ఇక్రిశాట్ ఫెన్సింగ్ ఏరియాలో డ్రైనేజీ సమస్యలు ఉన్నాయని వాటి పరిష్కారానికి రూ. 2 కోట్లు ప్రతిపాదనలకు మంజూరు ఇవ్వాలని చెప్పారు. మ్యాక్‌సొసైటీలో గతంలో వన్ టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీసీ) స్కీమ్‌లో భాగంగా కాలనీవాసులు తాగునీటి బిల్లులు చెల్లించడం జరిగిందని, అయినా వారికి తాగునీటి బిల్లులు వస్తున్నాయని వెంటనే సమస్యను పరిష్కరించాలన్నారు. ఆర్సీపురంలో జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ఓపెన్ డ్రైన్ నిర్మాణం చేపట్టి డ్రైనేజీ లైన్‌ని ఓపెన్ డ్రైన్‌లో కలపడంతో ఆర్‌ఆర్‌నగర్‌లో డ్రైనేజీ సమస్యలు వస్తున్నాయని తెలిపారు. ఓపెన్ డ్రైన్‌కి ఆనుకొని రూ.2కోట్లతో నూతన డ్రైనేజీ పైప్‌లైన్‌ని వేస్తే సమస్య పరిష్కారమవుతుందని ఎండీ ఆశోక్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో త్వరలో సమస్యలను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

## చిట్కుల్‌లో నీటి ఎద్దడికి పరిష్కారం

### కొత్త పైప్‌లైన్ వేసేందుకు మున్సిపాలిటీ నిర్ణయం

పటాన్‌చెరు రూరల్, మే 12 : దాహం తీర్చని సమీక్షలు పేరున సోమవారం 'నమస్తే తెలంగాణ'లో వచ్చిన కథనంపై అధికారులు స్పందించారు. ఇస్నాపూర్ మున్సిపల్ కమిషనర్ శ్రీహరి స్పందించి మూడు రోజుల్లో టెండర్ పిలిచి యుద్ధ ప్రాతిపాదికన సాయి సంతోషి కాలనీవాసులకు మంచినీరు అందజేస్తామని పేర్కొన్నారు. మంగళవారం జాతీ య రహదారి విస్తరణలో ధ్వంసమైన మిషన్ భగీరథ పైప్‌లైన్‌ను ఆయన సిబ్బందితో కలిసి పరిశీలించారు. దాదాపు మూడు వందల మీటర్ల పైప్‌లైన్‌ను కొత్తగా వేసి కాలనీలైన్‌ను పునరుద్ధరించేందుకు నిర్ణయించారు. ఈ మేరకు 'నమస్తే తెలంగాణ'తో మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ మూడు రోజుల్లో టెండర్ ప్రక్రియ పూర్తి చేసి చిట్కుల్ సాయి సంతోష్ కాలనీకి తాగునీటిని అందజేస్తామని తెలిపారు. ప్రజల దాహార్తి తీర్చేందుకు నిరంతరం సిద్ధంగా ఉన్నామని వారం రోజుల్లోపు కాలనీవాసులకు నీరందిస్తామని పేర్కొన్నారు. మిషన్ భగీరథ గ్రిడ్ పటాన్‌చెరు ఏఈ కవిత 'నమస్తే' కథనంపై స్పందించి గ్రిడ్ పైప్‌లైన్ ధ్వంసమైన చోట మరమ్మతులు చేస్తామని తెలిపారు. రెండు రోజుల్లో మెయిన్ లైన్‌ను పునరుద్ధరిస్తామని పేర్కొన్నారు. నేషనల్ హైవే కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పైప్‌లైన్ పగిలిందని వివరించారు. ముత్తంగి హైవేలో పగిలిన పైప్‌లైన్లను మార్చి నీటిని అందజేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. సాయి సంతోషి కాలనీవాసులకు వారంలోపు తాగునీరు ఇచ్చేందుకు మున్సిపాలిటీ అధికారులు కొత్త పైప్‌లైన్ వేస్తున్నారనే సమాచారం మేరకు కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సిర్గాపూర్ : నల్లవాగు గురుకులంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

సిర్గాపూర్ మే 12 : మండలంలోని నల్లవాగు సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. స్థానికంగా 1997-98 ఏడాదిలో టెన్త్ బ్యాచ్‌కు సంబంధించిన పూర్వ విద్యార్థులంతా ఒక చోటికి చేరి సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకొని ఆనందాన్ని పంచుకున్నారు. అప్పటి గురువులను సన్మానించారు. వైస్ ప్రిన్సిపాల్ విఠల్ తను చదువుకున్న ఇదే గురుకులంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనంతో ఆనందం వ్యక్తం చేశారు.

## అక్రమంగా చెరువు మట్టి తరలింపు



చాకిచెరువు నుంచి ట్రాక్టర్ల ద్వారా మట్టి తరలిస్తున్న దృశ్యం

హత్నూర, మే 12 : మండలకేంద్రమైన హత్నూర చాకిచెరువు నుంచి సోమవారం అక్రమంగా నల్లమట్టిని ట్రాక్టర్ల ద్వారా వ్యవసాయ పొలానికి తరలించారు. చెరువులో రెండు జేసీబీలతో 40ట్రాక్టర్ల ద్వారా సుమారు రెండు వందల ట్రిప్పుల మట్టిని తరలించి పొలంలో నిలువు చేశారు. ఇప్పటికే చెరువులో తీసిన గుంతల్లోపడి మూగజీవాలతో పాటు ముగ్గురు వ్యక్తులు పడి మృతిచెందారని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. ఈవిషయమై హత్నూర తహసీల్దార్ ఫర్హీన్‌షేక్‌ను వివరణకోరగా, పొలం యజమాని తన వద్దకు వచ్చి పొలం లోతుగాఉందని ఎత్తుపెంచడానికి మట్టి అవసరం ఉందనడంతో అనుమతి ఇచ్చానని అదనంగా మట్టి తరలించకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శికి సూచించినట్లు తెలిపారు.

## నాణమైన విత్తనాలను పంపిణీ చేయాలి



సమావేశంలో రాయికోడ్ డివిజన్ వ్యవసాయ శాఖ అధికారి సత్యనారాయణ

రాయికోడ్,మే 12 : గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం చేస్తున్న రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలను అందజేయలని రాయికోడ్ డివిజన్ వ్యవసాయ శాఖ అధికారి సత్యనారాయణ అన్నారు. సోమవారం మండల కేంద్రమైన రాయికోడ్‌లో ఉన్న రైతు వేదికలో మండల ఫర్టిలైజర్స్ దుకాణాదారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫర్టిలైజర్ దుకాణాదారులు ఎరువుల, విత్తనాల విక్రయించేందుకు లైసెన్సులను రెన్యువల్ చేయించుకోవాలన్నారు. సమవేశంలో రాయికోడ్,వట్‌పల్లి, మునిపల్లి మండలాల ఏవోలు సారికరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, అనితలతో పాటు సంగారెడ్డి సంకేతిక ఏవో శ్రీకాంత్ రాహూల్, ఏఈవోలు, మండల ఫర్టిలైజర్స్ దుకాణదారులు ఉన్నారు.

## అక్రమ నిర్మాణాలు నేలమట్టం



ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలను కూల్చిన రెవెన్యూ అధికారులు

అమీన్‌పూర్ మే 12 : అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 993, 994 గల ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో సోమవారం అమీన్‌పూర్ రెవెన్యూ అధికారులు కూల్చివేత్తలు చేపట్టారు. అమీన్‌పూర్ పరిధిలోని ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలవడంతో ఎప్పటికప్పుడు కట్టడాలను కూల్చివేశామని ఈ సందర్భంగా తాహసీల్దార్ రామస్వామి పేర్కొన్నారు. ప్రభుత్వ స్థలాల్లో ఎక్కడ నిర్మాణాలు చేపట్టినా కూల్చివేతలతో పాటు చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.



ఈదురుగాలులతో కూడిన వర్షానికి సోమవారం కుప్పానగర్-మాచ్నూర్ గ్రామాల దారిలో చెట్లు విరిగి పడ్డాయి. ప్రయాణికుల రాకపోకలు తీవ్ర ఇబ్బందిగా మారింది.
-ఝరాసంగం, మే 12





కొర్లకుంటలో ఉన్న పల్లె ప్రకృతి వనం, పల్లె ప్రకృతి వనంలో సంరక్షణ లేక ఎండిపోతున్న చెట్లు





కొర్లకుంటలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం దుస్థితి

# పల్లె ప్రకృతి వనంలో ఆహ్లాదం ఎక్కడా ?

- క్రీడా మైదానంలో కనిపించని పరికరాలు
- ఆటలకు దూరంగా పల్లె యువకులు
- ఆహ్లాదానికి దూరంగా పల్లె ప్రకృతి వనాలు
- ప్రకృతి వనంలో వాకింగ్ ట్రాక్‌లు కనుమరుగు
- ఎండిపోతున్న చెట్లు.. సంరక్షణ చర్యలు కరువు

పటాన్‌చెరు, మే 12 : పల్లె ప్రజలకు ఆహ్లాదాన్ని అందించేందుకు ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలు అధ్వానంగా తయారయ్యాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి గ్రామ పంచాయతీలో పల్లె ప్రకృతి వనాలు, క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసింది. గ్రామాలకు సమీపంలో పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేసి చెట్లు పెంపకం చేసింది. ప్రకృతి వనంలో ప్రజలు వాకింగ్ చేసేందుకు వాకింగ్ ట్రాక్‌లు నిర్మాణం చేసింది. కేసీఆర్ ప్రభుత్వం పల్లె ప్రజలకు ఆహ్లాదం అందించేందుకు లక్షలు ఖర్చు చేసి చెట్లు పెంచింది. చెట్లకు నీరు అందించేందుకు బోర్లు ఏర్పాటు చేయడంతో పాటు ట్యాంకర్లు ద్వారా మొక్కలకు నీరు సరఫరా చేసింది. పచ్చని చెట్లతో కళకళలాడే ప్రకృతి వనాల్లో ఉన్న చెట్లు ప్రస్తుతం ఎండిపోతున్నాయి. క్రీడా ప్రాంగణంలో పరికరాలు లేకపోవడంతో ఎడారిగా మారిపోతున్నా యి. జిన్నారం మండంలోని నల్తూర్ గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనంలో ఉన్న చెట్లుకు సంరక్షణ చర్యలు చేయకపోవడంతో ఎండిపోయాయి. నల్తూర్ పంచాయతీ పరిధిలో ఉన్న కొర్లకుంటలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం, క్రీడా ప్రాంగణం అధ్వానంగా మారింది. పర్యవేక్షణ చేయవలసిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవరించడంతో పచ్చని చెట్లు ఎండిపోతున్నాయి.

### నల్తూర్ పల్లె ప్రకృతి వనంలో ఎండుతున్న చెటు

జిన్నారం మండలంలోని నల్తూర్ గ్రామ పంచాయతీ పరిధిలో నల్తూర్, కొర్లకుంట గ్రామాలు ఉన్నాయి. ప్రభుత్వం లక్షలు ఖర్చు చేసి రెండు గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాలు, క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసింది. పల్లె ప్రకృతి వనంలో మొక్కలు పెంచేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం పంచాయతీలకు ట్రాక్టర్లు, ట్యాంకర్లు అందజేశారు. పంచాయతీల నిర్వాహణ కోసం ప్రతి నెల నిధులు విడుదల చేసేవారు. దీంతో పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సర్పంచ్‌లు పర్యవేక్షణలో మొక్కల సంరక్షణ చేసే వారు. గ్రామంలో పచ్చని చెట్లుతో పల్లె ప్రకృతి వనాలు కళకళలాడేవి. గ్రామస్తులు ఉదయం, సాయంత్రం పల్లె ప్రకృతి వనానికి వెళ్లి వాకింగ్ చేయడంతో పాటు కాలక్షేపం చేసేవారు. పంచాయతీలకు పాలక వర్గం లేకపోవడంతో పాటు పర్యవేక్షణ లేక చెట్లుకు నీరు పోయకపోవడంతో ఎండిపోతున్నాయి. చెట్లు ఎండిపోతున్నా, సంరక్షణ చర్యలు తీసుకోవడం లేదు. పల్లె ప్రకృతి వనంలో పెంచిన మొక్కలు సంరక్షణ కోసం కూలీలు పని చేసే వారు. ప్రస్తుతం కూలీలు కనిపించడం లేదు. దీంతో మొక్కల ను చెట్లు చేసిన కాపాడే వారు లేక పశువులు, మేకలకు మేతగా మారిపోతున్నాయి.

### ఎడారిగా మారిన క్రీడా ప్రాంగణాలు

రూ. లక్షలు ఖర్చు చేసి నల్తూర్, కొర్లకుంటలో ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసింది. క్రీడా ప్రాంగణంలో గ్రామస్తులు ఆటలు ఆడేందుకు పరికరాలు ఏర్పాటు చేశారు. ఆటలు ఆడే పరికరాలు క్రీడా మైదానంలో కనిపించడం లేదు. ఎక్కడ చూసినా బోర్డులు కనిపిస్తున్నాయి. పరికరాలు లేక గ్రామస్తులు అటు వైపు పోవడం లేదు. పశువులు, మేకలు, గొర్రెలను క్రీడా మైదాలకు తీసుకవచ్చి ఉంచుతున్నారు. పరికరాలు లేకపోవడంతో ఎడారిగా మారిపోయిన్నాయి. ఆట వస్తువులు చోరీకి గురవుతున్నాయి. ప్రస్తుత పాలకుల నిర్లక్ష్యంతో పచ్చని చెట్లు ఎండిపోయి, క్రీడా మైదానాలు ఎడారిగా మారాయి.





నల్తూర్‌లో ఉన్న క్రీడా ప్రాంగణం , క్రీడా మైదానంలో కనిపించని పరికరాలు



నల్తూర్ గ్రామంలో ఉన్న పల్లె ప్రకృతి వనంలో ఎండిపోతున్న చెట్లు

## 97వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు





నల్లవల్లిలో డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా రిలే నిరాహారదీక్షలు చేస్తున్న మహిళలు

గుమ్మడిదల, మే 12 : ప్యారానగర్ డంపింగ్‌యార్డుపై స్పందించండి సార్లూ అని నల్లవల్లి, ప్యారానగర్ గ్రామస్తులు రాష్ట్ర ప్రభుత్వాన్ని, జిల్లా యంత్రాంగాన్ని వేడుకుంటున్నారు. ఎంఎస్‌డబ్ల్యూతో ఇక్కడి గ్రామాల్లో పర్యావరణంతో పాటు భూగర్భ జలాలు కలుషితమై వ్యవసాయానికి యోగ్యం కాకుండా ఇక్కడి పంట భూములు మారుతాయని రైతు జేఏసీ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 97 రోజులుగా డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా రిలే నిరాహారదీక్షలు చేస్తున్నా ఇప్పటి వరకు రాష్ట్ర సర్కారు, జిల్లా యంత్రాంగం ఎలాంటి నిర్ణయానికి రాకపోవడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం 97వ రోజు రిలే నిరాహారదీక్షలో రైతు జేఏసీ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొని వారి ఆవేదనను వ్యక్తం చేశారు. ఇప్పటికైనా డంపింగ్‌యార్డు రద్దుపై ఒక నిర్ణయానికి రావాలని వేడుకుంటున్నారు. రైతు జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

## రైతులు తక్కువ నీటితో పంటలు పండించాలి



కర్ధనూర్‌లో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

పటాన్‌చెరు రూరల్, మే 12 : రైతులు తక్కువ నీటితో పంటలు పండించాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం శాస్త్రవేత్తలు అన్నారు. సోమవారం పటాన్‌చెరు మండలం కర్ధనూర్‌లో మండల వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన సమావేశానికి రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ కే లక్ష్మీప్రసన్న, డాక్టర్ బీ స్పందన పాల్గొని రైతులకు సూచనలు చేశారు. రైతులు యాదయ్య, శివయ్య, విక్రమ్, లక్ష్మీనారాయణ, మల్లికార్జున్, కే మల్లేశం, పవిత్ర, కార్తీక, ఏఈవో చందర్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, మే 12 : నారాయణఖేడ్ మండలం నాగాపూర్ తండాకు చెందిన బిక్యానాయక్, సీతారాం తాండకు చెందిన కాశీరామ్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. సోమవారం బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి పరామర్శించారు. మండలాధ్యక్షుడు పరమేశ్, మాజీ సర్పంచ్ సంగప్ప, మాజీ ఎంపీటీసీ రాజు, నాయకులు భూమయ్య, మంజునాయక్, చందర్‌నాయక్ ఉన్నారు.



పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే చంటిక్రాంతికిరణ్

### అందోల్‌లో..

అందోల్, మే 12 : జర్నలిస్టు కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ సోమవారం పరామర్శించారు. అందోల్ నియోజకవర్గం టీ న్యూస్ రిపోర్టర్ కాశీనాథ్ భార్య ప్రభావతి అనారోగ్యంతో మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సోమవారం కాశీనాథ్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట నాయకులు జైపాల్‌రెడ్డి, మాజీ పట్టణ అధ్యక్షుడు వెంకటేశం, జర్నలిస్టులు ప్రదీప్‌గౌడ్, సందీప్ తదితరులు ఉన్నారు.

## ఘనంగా గౌతమ బుద్ధుడి విగ్రహపతిష్ఠాపన



గౌతమ బుద్ధుడు విగ్రహాన్ని దర్శించి ప్రత్యేక పూజలు చేస్తున్న సమతా సైనిక్ నాయకులు

జహీరాబాద్, మే 12 : జహీరాబాద్ మండలంలోని బూచినెల్లి గ్రామ శివారలోని గౌతమ బుద్ధ విహార్‌లో గౌతమ బుద్ధుడి విగ్రహాన్ని ఘనంగా ప్రతిష్ఠించారు. సోమవారం బుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని స్థానిక గౌతమ బుద్ధ విహార్‌లో గౌతమ బుద్ధుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, సమతా సైనిక్ దళ్ నాయకులు పాల్గొన్నారు.

## నర్సుల సేవలు ఎనలేనివి..



మిర్జాపూర్(బి) ఆరోగ్య కేంద్రంలో కేక్‌కట్ చేస్తున్న వైద్యాధికారులు, నర్సులు

జహీరాబాద్, మే 12 : రోగులకు వైద్య సేవలను అందించడంలో నర్సులు చేస్తున్న కృషి ఎనలేనిదని న్యాల్‌కల్ మండలంలోని మిర్జాపూర్ (బి) గ్రామంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రియాంక అన్నారు. సోమవారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు, నర్సులు కలిసి కేక్ కట్ చేసి అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. వైద్యాధికారులు సబా, సిబ్బంది శ్యామల, చండీదేవి, స్వప్న, సుజాత, వెన్నెల, మహిళ నాయకురాలు డాక్టర్ అస్మా, సురేఖ, విజయ తదితరులు పాల్గొన్నారు.

## జవాన్ మురళీ నాయక్‌కు నివాళి



మురళీ నాయక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాదారం గ్రామస్తులు

జిన్నారం, మే 12 : ఉగ్రవాదుల దాడికి వ్యతిరేకంగా భారత ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా అమరులైన వీర జవాన్ మురళీ నాయక్‌కు జిన్నారం మండలం మాదారం గ్రామస్తులు నివాళులర్పించారు. గ్రామంలోని అమరవీరుల స్తూపం వద్ద విద్యార్థి జేఏసీ నియోజకవర్గ అధ్యక్షుడు విజయ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్, యువకులతో కలిసి జాతీయ జెండాలను ప్రదర్శిస్తూ జై జవాన్ నినాదాలతో వీర జవాన్ మురళీ నాయక్ చిత్రపటానికి నివాళులర్పించారు. గ్రామస్తులు దుర్గయ్య, గణేశ్, రమణాసింగ్, రాజు గౌడ్, మల్లేశ్, రామకృష్ణ, లింగం, భాస్కర్, మహేందర్ గౌడ్, భానుచందర్, తదితరులు పాల్గొన్నారు.

## వడ్ల కొనుగోలు కేంద్రం తనిఖీ



సిర్గాపూర్‌లోని ఐకేపీ పీపీసీ సెంటర్‌లో వడ్లను పరిశీలిస్తున్న తహసీల్దార్

సిర్గాపూర్, మే 12 : మండల కేంద్రమైన సిర్గాపూర్‌లో కొనసాగుతున్న ఐకేపీ వడ్ల కొనుగోలు కేంద్రాన్ని సోమవారం తహసీల్దార్ అబ్దుల్ నజీంఖాన్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ మేరకు వడ్ల తేమ శాతాన్ని పరిశీలించారు. స్థానిక రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు చేసిన వడ్లను వెంటనే రైస్ మిల్లర్లకు తరలించాలని స్థానిక సిబ్బందికి సూచించారు. దీంట్లో ఏదైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. ఎంఆర్ఐ మదన్, సీసీ సంతోష్, బుక్ కీపర్, వీవో లీడర్లు ఉన్నారు.

## జొన్నల కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నాగల్‌గిద్ద, మే 12 : జొన్నల కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని నాబార్డు డీడీఎం కృష్ణతేజ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సక్రునాయక్ తాండ వద్ద ఉన్న జొన్న కోనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. దళారుల ప్రమేయం లేకుండా రైతులు నేరుగా కొనుగోలు కేంద్రాన్ని వచ్చి తమ పంటలను విక్రయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రూప్‌సింగ్, మనోహర పాటిల్, దేవరెడ్డి, రాజు ఉన్నారు.

### గర్డెగాంలో ..

సిర్గాపూర్, మే 12 : మండలంలోని గర్డెగాంలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని కడ్పల్ పీఏసీఎస్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి ప్రారంభించారు. ఈ మేరకు కాంటకు పూజలు చేసి బస్తాలను తూకం చేశారు. కార్యక్రమంలో సీఈవో శ్రీకాంత్‌రెడ్డి, రైతులు శ్రీనివాస్‌రెడ్డి, రమేశ్ ముదిరాజ్, భూంగొండ, నారాయణ, లక్ష్మణ్‌రావు తదితరులు ఉన్నారు.

## దొంగతనం కేసులో నేరస్తుడు అరెస్టు

అమీన్‌పూర్, మే 12 : మూడు రోజుల కింద అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో వృద్ధురాలి వద్ద ఆటోడ్రైవర్ బంగారం, నగదు దొంగలించిన కేసులో నేరస్తుడిని అమీన్‌పూర్ పోలీసులు సోమవారం పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. మూడవత చిన్న అలియాస్ శ్రీను (24) గాజుల రామారాం మాదాపూరంలో నివాసమంటూ, ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. రెండు రోజుల కింద తన ఆటోలో ప్రయాణిస్తున్న వృద్ధురాలిని అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో నిర్మానుష్య ప్రాంతానికి తీసుకువెళ్లి బంగారం నగదును దోచుకెళ్లాడు. దీంతో పోలీసులు రంగంలోకి దిగి నేరస్తుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కర్నూలు జిల్లా పుల్లగిరిలో ఉన్నట్లు తెలుసుకొని నేరస్తుడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. బంగారంతో పాటు రూ. ఏడు వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

## పరిహారం చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న ఎస్పీ పారితోష్ పంకజ్

సంగారెడ్డి, మే 12 : ఇటీవల మృతి చెందిన హోంగార్డు మశ్చేందర్ కుటుంబానికి యాక్సిడెంటల్ డెత్‌లో మంజూరైన పరిహారం రూ. 34లక్షల చెక్కును ఎస్పీ కుటుంబ సభ్యులకు అందజేశారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో మృతుడి భార్య భాగ్యలక్ష్మికి పరిహారం చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసుశాఖ నుంచి రావల్సిన అన్ని సదుపాయాలను త్వరగా అందే విధంగా చూస్తామని, పోలీసుశాఖ వారి కుటుంబానికి ఎల్లవేళలా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అడ్మినిస్ట్రేషన్ అధికారి కల్యాణి, ఆర్.ఐ డానియెల్, రాజశేఖర్‌రెడ్డి, యాక్సిస్ బ్యాంక్ మేనేజర్ రాజేందర్, సిబ్బంది, మృతుడి కుటుంబీకులు ఉన్నారు.

## నిండిపోయిన డంప్‌యార్డు ఖాళీ

పటాన్‌చెరు రూరల్, మే 12 : నిండిపోయిన డంప్‌యార్డు పేరున చెత్త డంప్‌యార్డుపై 'నమస్తే తెలంగాణ' రాసిన కథనంతో ఇస్నాపూర్ మున్సిపల్ అధికారులు స్పం దించారు. ఈ నెల 8న నిండిపోయిన డం పింగ్‌యార్డు, ఇస్నాపూర్‌లో లోపల జాగా లేక గేటు ఎదుట వేస్తున్న చెత్త పేరున కథనం వచ్చింది. ఈ కథనంపై స్పందించిన ఇస్నాపూర్ మున్సిపల్ కమిషనర్ శ్రీహరి తన సిబ్బందితో కలిసి జేసీబీలతో డంప్‌యార్డును శుభ్రం చేస్తున్నారు. చెత్తను తగలబెట్టకుండా చూస్తామన్నారు. ఇస్నాపూర్‌లో అన్ని రాష్ట్రాల ప్రజలు నివసిస్తుండటంతో వారికి అవగాహన కల్పించి చెత్తను పునర్వినియోగించుకునేలా చేసే ప్రణాళిక ఉందన్నారు. కొందరు వ్యాపారులు నిర్లక్ష్యంగా చెత్తను రాత్రివేళల్లో నడిరోడ్డున పారవేసి వెళ్తున్నారని తెలిపారు.

## వీరభద్రస్వామి ఆలయంలో చండీహోమం

గుమ్మడిదల, మే 12 : జిల్లాలోని సుప్రసిద్ధశైవక్షేత్రమైన బొంతపల్లి భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవాలయంలో వైశాఖ మాసం పౌర్ణమిని పురస్కరించుకుని చండీ హోమాన్ని వైభవంగా నిర్వహించారు. గుమ్మడిదల మున్సిపాల్ పరిధిలోని బొంతపల్లిలోని వీరభద్రస్వామిదేవాలయంలో సోమవారం వీరభద్రస్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, భద్రకాళీ అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం ఈవో శశిధర్‌గుప్తా, జూనియర్ అసిస్టెంట్ సోమయ్య,ధర్మకర్తల ఆధ్వర్యంలో చండీహోమాన్ని నిర్వహించారు.

## లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

సంగారెడ్డి, మే 12 : ప్రభుత్వ ఆదేశాల మేరకు తెలంగాణ రైసింగ్ సమ్మర్ క్యాంప్‌ను పాఠశాలలో నిర్వహించడం, 300 వందల మంది విద్యార్థులు అనేక విషయాల్లో శిక్షణ, విజేతలకు బహుమతులు అందజేసేందుకు లయన్స్ క్లబ్ తీసుకున్న సేవలు అభినందనీయమని డీఈఏ వెంకటేశ్వర్లు కొనియాడారు. సోమవారం పట్టణంలోని పోతిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రెండు వారాలుగా పలు శిక్షణ కార్యక్రమాల్లో ప్రతిభ కనబర్చి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు డీఈవో బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కోశాధికారి కృష్ణ, జోన్ చైర్మన్ వెంకటేశం, సభ్యులు వెంకన్న, రామచంద్రం, భరతయ్య, ఉపాధ్యాయులు రేణుక, ఆనందంతో పాటు లయన్స్ క్లబ్ ఆఫ్ సంగారెడ్డి ఆదర్శ సభ్యులు పాల్గొన్నారు.

## నిషేధిత ఆల్ఫాజోలం లభ్యం.. కేసు నమోదు

అందోల్, మే 12 : నిషేధిత ఆల్ఫాజోలం తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతడిపై కేసు నమోదు చేసినట్లు జోగిపేట ఎక్సైజ్ సీఐ సాగర్‌రెడ్డి తెలిపారు. సమాచారం మేరకు తమ సిబ్బందితో కలిసి సోమవారం మండలంలోని డాకూర్ శివారుల్లో బైక్‌పై వెళ్తున్న వ్యక్తి వద్ద సోదాలు చేయగా, 218 గ్రాముల నిషేధిత ఆల్ఫాజోలం లభించినట్లు తెలిపారు. నిందితుడిని విచారించగా, అందోల్ మండలం అక్సాన్‌పల్లికి చెందిన ఎర్రోల పోచయ్యగా తెలిపాడు. అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఎస్సైలు సందీప్ రెడ్డి, విజయ్‌కుమార్, సిబ్బంది విక్రమ్, సాయిలు, ముఖీం ఉన్నారు.

## ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

సిర్గాపూర్, మే 12 : మండల కేంద్రమైన సిర్గాపూర్‌లోని ఎస్టీ బాలికల గురుకుల పాఠశాల/కళాశాలలో ఇంటర్ ఫస్టియర్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ శైలజ సోమవారం తెలిపారు. ఫస్టియర్‌లో ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. అయితే బైపీసీలో పీహెచ్‌సీ -1, స్పోర్ట్స్, ఈబీసీ, ఓబీసీ-1, ఆర్ఫన్ -1 ఖాళీలు ఉండగా, ఎంపీసీలో ఎస్టీ -32, బీసీ-0, ఎస్సీ -1, పీహెచ్‌సీ-1, స్పోర్ట్స్ -1, ఈబీసీ -1, ఆర్ఫన్ -1 మాత్రమే ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ ప్రవేశాల కోసం మే 16న పీవీటీజీ కళాశాల హయత్‌నగర్‌తో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని ఆమె సూచించారు.